# అమ్మ ఒడిలోకి

పట్టణంలో వుంటే తల్లి గర్భంలో ఉమ్మ నీటిలో ఉక్కిరిబిక్కిరి అయినట్లుగా వుంటుంది. సొంత ఊరు చేరుకుంటే అమ్మ ఒడిలోకి వచ్చినట్లుగా వుంటుంది.

పదిరోజుల్లో అమెరికా వెళ్ళబోతున్నాడు ప్రియతమ్. మేం మా సొంత ఊరికి బయల్దేరేముందు సుమలత సణుగుతూనే వుంది.

“పదిరోజుల్లో అమెరికా ప్రయాణం పెట్టుకుని పల్లెటూళ్ళలో తిప్పడం ఎందుకు?

“మీ అమ్మగారికి ఆశీస్సులు మనవడికి కావాలనుకుంటే ఆవిడనే ఇక్కడకు పిలిపించవచ్చు కదా!” అంది సుమలత.

“అమ్మ పెద్దదైపోయింది. ఎనభయ్యేళ్ళు వచ్చాయి. ఇంకా ప్రయాణాలు ఏం చేస్తుంది? మన అబ్బాయి అమెరికా వెళ్ళాడమంటే నాలుగైదేళ్ళకుగాని తిరిగి రాడు. అప్పటికి అమ్మ వుంటుందో.... వుండదో... నాలుగురోజులు వాడిని అమ్మదగ్గర ఉంచితే ఆమెకు తృప్తిగా వుంటుంది” అన్నాను మా ఆవిడకు నచ్చచెబుతూ.

“అదికాదండీ... నా భయం ఏమిటంటే... ముసలావిడ వీడి మనస్సు మార్చి ఇండియాలోనే వుండి పొమ్మంటుందేమోనని” అంది సుమలత.

“అవును, ఒక్కగానొక్క కొడుకును అమెరికా పంపడం ఎందుకురా? మీరు బోలెడంత సంపాదించారు. కళ్ళెదుట వాడిని వుండనివ్వకుండా ఇతర దేశాలెందుకు? అని అమ్మ అంటుంది.

అయినా ఆవిడ మాటలు మనం పట్టించుకుంటామా? పెళ్ళైన కొత్తలో మనిద్దరినీ మా వూళ్ళోనే వుండిపొమ్మంది. సొంత వూరుకి దగ్గర్లోనే ప్రాక్టీసు పెట్టమంది. అమ్మ మాట పట్టించుకోలేదుగా, ఇప్పుడూ అంతే!” మా ఆవిడకు నచ్చచెప్పాను.

యలవర్రు చేరుకునేసరికి సాయంత్రం ఆరుగంటలయ్యింది. మా ఊరులో అడుగుపెట్టగానే నా సిమెంటు పాదాలు మట్టిపాదాలుగా మారినట్లు అన్పించింది. బీడుగా మారిన మనస్సులో పచ్చటి మొక్కలు మొలిచినట్లు అన్పించింది.

ప్రియతమ్ ఎమ్.డి. పేడియాట్రిక్స్ చేశాడు. పిల్లల వైద్యుడిగా రెండేళ్ళ అనుభవం కూడా ఉంది. అమెరికా వెళ్లి పిల్లల వైద్యంలో స్పెషలైజేషన్ చెయ్యమని మేమే ఒత్తిడి చేశాం. డాలర్లు వెనకేసుకుని వాడు ఆనందంగా వుండాలి.

మనవడిని చూసి అమ్మ సంబరపడిపోయింది.

ఒళ్ళంతా తడిమింది.

వాడి బుగ్గలు నొక్కింది

"ఏరా నాయనా! నాయనమ్మను చూడటానికి ఇప్పుడు తీరిక దొరికిందా?" గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి ఇస్తూ అడిగింది తులశమ్మ.

సంవత్సరమైంది స్వగ్రామం వచ్చి. హాస్పిటల్ వదిలిరావాలంటే కష్టమే. అమ్మను వచ్చి హైదరాబాద్‌లో వుండమంటే వుండదు.

ఆకాశంలో స్వేచ్ఛగా తిరిగే పక్షిని పంజరంలో ఉంచినట్లు వుంటుందామెకు.

ఆ పల్లెటూరిలో రోజూ ఊరంతా చుట్టివచ్చి అందరినీ పలకరించి వస్తేగాని ఆమెకు నిద్రపట్టదు. తనుండేది బంజారాహిల్స్‌లో... పక్క ఇంట్లో వాళ్ళే కాదు, ఇంట్లో వున్న కోడలికి కూడా ఆమెతో మాట్లాడటానికి తీరిక దొరకదు"

"నాయనమ్మ కుండలో నీళ్ళు తెచ్చి ఇచ్చింది అవి తాగొద్దు. అమ్మ కార్లో మినరల్ వాటర్ బాటిల్ పెట్టింది. అవి తెచ్చుకుని తాగు" అన్నాను.

నాయనమ్మ ఇచ్చిన గ్లాసునీళ్ళు అందుకుని వెంటనే గడగడా తాగేశాడు ప్రియతమ్.

"అమ్మ అంటే ఎందుకు అంత భయపడతావ్ డాడీ?" అడిగాడు ప్రియతమ్.

"హైదరాబాద్‌లో మనింట్లో ఈ ప్రశ్న ఎప్పుడూ వెయ్యలేదేమిట్రా?" అడిగాను.

"నాయనమ్మను చూస్తే ఆ ధైర్యంవస్తుంది నాన్నా! ఆమెది స్వేచ్ఛాయుత జీవితం. కొడుకు దగ్గరుండాలన్న సెంటిమెంట్‌లేదు. సొంత ఊరులో ఉండటమే ఆమెకు ఇష్టం. ఊళ్ళో వాళ్ళంతా ఆమెకు అయినవాళ్ళే. కన్నకొడుకు, మనవడు రెండు మూడు సంవత్స

రాలు కన్పించకపోయినా బాధపడదు. ఊళ్ళోవాళ్ళు పలకరించనిరోజు బాధపడుతుంది" అన్నాడు ప్రియతమ్.

"నాయనమ్మను చూడగానే నీ మనస్సులోని భావాలకు మాటలుకట్టి చెబుతున్నావ్. నాలుగు రోజులు ఇక్కడ ఉన్నావంటే అమెరికా వెళ్ళనని మొండికేస్తావేమో! అందుకే అమ్మ నిన్ను ఇక్కడకు తీసుకురావద్దని మొత్తుకుంది."

నా భయం నాది. పొరపాటున వీడు 'అమెరికా వెళ్ళను' అని అన్నాడంటే సుమలత నా ప్రాణాలు తోడేస్తుంది. కొడుకు భవిష్యత్తును గోతిలో పాతేశానని రంకెలు వేస్తుంది. బి.పి. షుగర్ నార్మల్‌లో వుండక... వీడిని ఇక్కడకు తీసుకువచ్చి ప్రాబ్లమ్ క్రియేట్ చేసుకున్నాడేమో తను...

"అమెరికా వెళ్ళిపోతున్నావ్రా?" ఆశ్చర్యంగా నోరు తెరిచి వుండిపోయింది.

ముసలమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఆమె కళ్ళల్లో నీళ్లు తిరగడం కొత్తేమీ కాదు. తను చిన్నప్పటి నుండి చూస్తూనే వున్నాడు. అలా అనుకోగానే నాకు గతం గుర్తుకు వచ్చింది.

తండ్రి రోజూ తాగి ఇంటికి వచ్చేవాడు. అమ్మని గొడ్డును బాదినట్లు బాదేవాడు. మాంసం వండలేదనో, చేపలపులుసు వెయ్యలేదనో, వేడినీళ్ళు మరగబెట్టలేదనో... ఏదోక వంకతో కొడుతూనే వుండేవాడు. నాన్న అమ్మని కొడుతుంటే తను అసహనంగా ఆమె వెనుక దాక్కుని ఏడుపు మొహంతో నాన్నవైపు చూసేవాడు.

నాన్న రాక్షసుడిలా కనిపించేవాడు. 'ఏదో శాపంవల్ల దేవతలాంటి అమ్మ అన్ని కష్టాలు పడుతోంది' అనుకుని ఆమె కాళ్ళకు చుట్టుకుపోయేవాడు. నాన్న వెళ్ళిపోయాక అమ్మ మోచేతులను, కాళ్ళకు తగిలిన దెబ్బలకు నవనీతం పూసేవాడు తను.... తన తల నిమురుతూ వుండేది.

ఆ సమయంలో నయాగరా జలపాతంలా కన్నీటి ధారలు అమ్మ చెంపలమీద కన్పించేవి.

తనకి పదేళ్ళప్పుడు నాన్న చనిపోయాడు.

నిశ్శబ్దంగా రోదించింది అమ్మ. నాన్న చనిపోయాక వైధవ్యం ముసుగులో ఓ మూల కూర్చోలేదు. ధైర్యంగా వ్యవసాయం పనులు చూసేది. శ్రద్ధగా తనను చదివించింది.

అమ్మ బట్టలు మట్టివాసన కొట్టేసి, ఆ వాసన తనకు ఎంతో నచ్చేది. పది ఎకరాల మాగాణి వుండటంతో ఆర్థిక ఇబ్బందులులేవు.

కష్టపడి, ఇష్టపడి డాక్టరు చదువు పూర్తిచేశాడు. తనతోపాటే యం.బి.బి.యస్ చదివిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనుకున్నాడు.

అమ్మ అభ్యంతరంపెట్టలేదు.

సుమలత గైనకాలజిస్టు అయ్యింది. తను ఎమ్.ఎస్. పూర్తిచేసి సర్జన్ అయ్యాడు. మామయ్య హైదరాబాద్‌లో లాయరు, బాగా సంపాదించే అవకాశాలు వున్నాయని అక్కడే తమను ప్రాక్టీసు పెట్టమని చెప్పాడు. అలాగే చేశాం.

అమ్మకు హైదరాబాద్‌లో ప్రాక్టీసు పెట్టబోతున్నామని చెప్పినప్పుడు నిశ్శబ్దంగా వుండిపోయింది. తన మాటకు అడ్డుచెప్పలేదు.

ఎవరికి తన అవసరం వుందో వాళ్ళ పక్షాన నిలిచింది. బీదా బిక్కికి సహాయ పడుతూ వుండేది. మంచిగంధం చెక్కలా సువాసనలు వెదజల్లుతూ అందరికీ ఆప్తురా లయింది. ఊళ్ళోవాళ్ళే కాదు ఊళ్ళోని చెట్లు కూడా అమ్మకి గౌరవంగా శిరస్సు వంచినట్లు అనిపిస్తుంది నాకు.

అందుకే,ప్రియతమ్ అమ్మ ఆశీస్సులు తీసుకుంటే బాగుంటుందని ఇక్కడకు తీసుకొచ్చాడు.

"కోడలు రాలేదా?" అడిగింది తులశమ్మ.

"ఇద్దరం వచ్చేస్తే హాస్పిటల్ ఎవరు చూస్తారమ్మా?" అమ్మ మౌనంగా వింది.

అమ్మంటే సుమలతకు పడదు.

మా ఊరికి దగ్గర్లోవున్న పొన్నూరులో చెరుకుపల్లిలోనో కొడుకు,కోడలు ప్రాక్టీసుపెట్టి చుట్టుప్రక్కల పల్లెల్లో వాళ్ళకి చికిత్స చేయాలి. ఎక్కువ ఫీజు తీసుకోకూడదు. పేదవాళ్ళకి ఉచితంగా వైద్యం చేయాలి" అవీ అమ్మ ఆలోచనలు.

సుమలత పూర్తిగా అందుకు విరుద్ధం. పల్లె ప్రాంతాల్లో వుండి ఉచితంగా వైద్యంచేస్తే మట్టికొట్టుకుపోవాల్సిందే. రేపు తమకు పుట్టబోయే సంతానాన్ని కూడా డాక్టర్లుగా చెయ్యాలంటే తాము మడికట్టుకుని కూర్చుంటే లాభంలేదు.

లక్షలు సంపాదించాలి. పిల్లల్ని విదేశాలు పంపించాలి. అదే స్టేటస్ సింబల్...

మన చెయ్యి ఎంత పొడవుందో అంతవరకే చాచటంకాదు. కొన్ని లక్ష్యాలు పెట్టుకుని ఆశలతో ఆకాశంలోని చుక్కలను తాకాలి" అదీ మా ఆవిడ ధ్యేయం.

పెళ్ళైన కొత్తల్లో కోడలికి ఎన్నోసార్లు చెప్పింది అమ్మ- "మీ ఆయనకంటే ముందు నలుగురు పిల్లలు పుట్టారు. సరైన వైద్యసౌకర్యాలు దగ్గర్లో లేక ఆపిల్లలు పురిట్లోనే చనిపోయారు. మీ ఆయన్ని ప్రసవించినప్పుడు మామూలుకంటే ఎక్కువ రక్తస్రావం అయ్యింది. ప్రసవించిన చోటునుండి హాస్పిటల్‌కి గంటలో నన్ను తీసుకెళ్ళగలిగితే నేను బ్రతికి బట్టకట్టగలిగే పరిస్థితి అది.

అప్పుడే గుంటూరులో మెడికల్ కాలేజీలో డాక్టరు కోర్సు చదివే పిల్లలకు పాఠాలు చెప్పే పెద్ద చదువులు చదివిన ప్రొఫెసరు పొన్నూరులో ఆసుపత్రి పెట్టాడు. చుట్టుప్రక్కల గ్రామాలవాళ్ళకి వైద్యసదుపాయం అందుబాటులోకి వచ్చింది. అక్కడకు నన్ను తీసుకెళ్ళాడు.

ఆయన వెంటనే వైద్యం చేసి నన్ను బ్రతికించాడు. మా అబ్బాయికి సంవత్సరం వయస్సప్పుడు ఆడుకునే గిలక్కాయ, గొంతుకు అడ్డుపడి శ్వాస ఆగిపోతే, ఆ డాక్టరే ప్రమాదం నుంచి రక్షించాడు. నీలాగ డాక్టర్లు పట్టణాలకు, విదేశాలకు పరుగులు తీస్తే ఇక్కడి జనాన్ని చూసేవాళ్ళెవ్వరు?"

అమ్మ మాటలు విన్పించుకోలేదు సుమలత, "మీకు మీ అమ్మ కావాలో... భార్యకావాలో తేల్చుకోండి..." అంటూ తనకు తెగేసి చెప్పేసింది.

భార్య మాటకి ఎదరు చెప్పే స్థితిలో లేడు. అప్పుడు ఇప్పుడూ... అమ్మ అప్పటికీ సర్దుకుపోతుంది. సుమలతకు తన మాట నెగ్గాలనే పంతం. 'ఐడెంటిటీ క్రైసిస్' ఏర్పడలేదు. తాను వ్యక్తిత్వ నిరూపణకు సిద్ధపడలేదు. తన సౌఖ్యం చూసుకున్నాడు.

పాలలో నానబెట్టిన అటుకులు రెండు గిన్నెల్లో తెచ్చి మా ఇద్దరికీ ఇచ్చింది అమ్మ.

గబగబా తినేశాడు ప్రియతమ్.

"ఇంకా కొంచెం తీసుకురా నాయనమ్మా" అని ప్రియతమ్ ఆత్రంగా అడిగేసరికి.

సంబరంగా వంటగదివైపు వెళ్ళింది తులశమ్మ.

"అమెరికా వెళ్ళబోయేవాడిని ఏదిపడితే అది తినెయ్యకూడదు" మా ఆవిడ నాకు చెప్పిన పాఠాలు గుర్తుకు వచ్చి అన్నాను.

నా మాటలేం వాడు లెక్కచెయ్యలేదు.

"వెన్ యు ఆర్ ఇన్ రోమ్ బి ఎ రోమన్"

చిన్నప్పుడు వాడికి నేను చెప్పిన పాఠాలు ఇప్పుడు వాడు నాకే అప్పగిస్తున్నాడు.

సినిమాలు చూడకూడదు, టీవీ ముందు ఎక్కువసేపు కూర్చోకూడదు. స్నేహితులతో గంటలకొద్దీ కబుర్లు చెబుతూ కాలక్షేపం చెయ్యకూడదు" అంటూ అనేక ఆంక్షలు పెట్టేది సుమలత. ఆమెముందు ఏమీఅనలేక నా దగ్గర విసుక్కునేవాడు ప్రియతమ్. "అమ్మ దగ్గర వున్నప్పుడు అమ్మచెప్పినట్లు చెయ్యాలి" అంటూ వాడికి ఆ ఆంగ్ల సామెత చెప్పేవాడు తను.

ఇంట్లో మనవడు ఉండేసరికి అమ్మ హడావుడి అంతా ఇంతా కాదు. సాంబయ్యగారి పాడిగేదె ఈనితే జున్నుపాలు తెచ్చి జున్ను వండింది. పక్కింట్లో నుంచి ఉలవచారు పట్టు కొచ్చింది. పల్లెటూరి పంటకాలు రుచి చూపించింది. ఎనభయ్యేళ్ళు వచ్చినా ఆమె చేతి పంట అమృతమే తనకు.

ప్రియతమ్‌ని అన్నీ చిన్న పిల్ల చేష్టలు... పెరట్లో ఉన్న మామిడి చెట్టు ఎక్కి కాయలు కొయ్యడం, ఇంటిముందు లేగదూడ పరుగెత్తుతూ వుంటే దాని వెనుకే వాడు పరుగెత్తడం, లేగదూడ నాలుకతో వాడి బుగ్గలు నాకుతుంటే పెద్దగా నవ్వడం, కట్టుగొయ్య ఊడబెరుక్కుని పాడిగేదె గాబు దగ్గరికి పరుగెత్తుకొస్తే, అది కుడితి తాగాక గేదెను తీసుకెళ్లినాడు సావిడిలో కట్టెయ్యడం" ఇవన్నీ నచ్చేవి కాదు తనకు. మందలించేవాడు.

చాటింపు వేసినట్లు ఊళ్ళో అందరికీ చెప్పింది మనవడు పిల్లల డాక్టరని. ఊళ్ళో ఏ పిల్లాడికి నలత చేసినా ఇంటికి తీసుకువచ్చి ప్రియతమ్ చేత పరీక్ష చేయించింది. పేదా బిక్కీ అయితే తనే డబ్బు లిచ్చి మందులు చెప్పించి ఇచ్చేది.

హైదరాబాద్‌లో నేను పెద్ద డాక్టర్ని అయినా నా దగ్గరికి ఎవరినీ తీసుకొచ్చేది కాదు అమ్మ. 'అసలు కంటే వడ్డీ ముద్దుకాబోలు' అనుకున్నాడు తను. నాయనమ్మతో పాటు ఊళ్ళో వాళ్ళ ఇళ్ళకు వెళ్లి చూసివచ్చేవాడు ప్రియతమ్. ఊళ్ళోని అందరితో మనవడు గర్వంలేకుండా స్నేహపూర్వకంగా మాట్లాడటం అమ్మకు ఎంతో నచ్చింది.

మరో రెండు రోజుల్లో హైదరాబాద్ తిరుగు ప్రయాణం. కాఫీగ్లాసు అందిస్తూ కుప్పలా కూలిపోయింది అమ్మ. ప్రముఖ వైద్యుడినయినా ఏమీ చేయలేని స్థితి. ఎంత గొప్ప డ్రైవరయినా నైపుణ్యం చూపించాలంటే కారు కావాలి గదా! దగ్గర్లో అన్ని సదుపాయాలున్న ఆసుపత్రి లేదు.

అమ్మని గుంటూరు తీసుకెళ్ళాం. అన్ని పరీక్షలు చేశాక బ్రెయిన్ ట్యూమరని నిర్ధారించారు.

అనుభవం కలిగిన డాక్టరుగా నాకు తెలుసు అమ్మ మూడు నెలలకంటే ఎక్కువ బ్రతకదని. కొత్త కెమోథెరపీ ట్రీట్‌మెంట్ ఇచ్చినా ప్రయోజనం వుండదని తెలుసు. గుంటూరులోనే నర్సింగ్ హోమ్‌లో ఉంచాలనుకున్నాం.

అప్పుడప్పుడు అమ్మ స్పృహలోనే వుంటున్నది. మాట్లాడటం, కొద్దిగా ఆహారం తీసుకుంటూనే వుంది. ఎక్కువ రోజులు బ్రతకనని అమ్మకు అర్థం అయ్యింది. అమ్మకి మరణమంటే వెరపు లేదు. మరణం జీవితానికి సహజమైన ముగింపని ఆమెకు తెలుసు. అందుకు ఆమె సిద్ధమే.

"ఇక్కడ వద్దురా... నన్ను మన ఊరు తీసుకువెళ్ళండి. నా ప్రాణం అక్కడ మట్టి, గాలిలోనే కలిసిపోవాలి" ఊరికి తీసుకుపొమ్మంది.

మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ తీసుకువెళ్ళవచ్చు.... మృత్యుముఖంలో వున్న అమ్మని మరికొన్ని రోజులు బ్రతికించవచ్చు... కానీ ఆ వైద్యం మరింత వేదనను కల్గించడం మినహా పెద్దగా ఉపయోగంలేదని నాకు బాగా తెలుసు.

ప్రియతమ్ కూడా అదే అభిప్రాయం వెలిబుచ్చాడు. "బ్రతుకు చివరి అంచులో వుంది నాయనమ్మా. మేలైన వేద్యం కోసం పరుగులు తీసే బదులు ఆమెను కనిపెట్టుకని వుండటమే కారుణ్యకార్యం. ఆమె మంచంమీద వున్నన్నాళ్ళూ దగ్గరుండి సేవలు చేస్తేచాలు, ఎంతో సంతోషిస్తుంది.

వియోగాన్ని భరించే శక్తి వస్తుంది. చివరి గడియల్లో ప్రేమానురాగాలు కురిపిస్తే, మందులకన్నా గొప్ప ఊరట కలిగిస్తాయి" అన్నాడు.

అప్పటివరకూ శిలలావున్న నాహృదయం ద్రవీభవించింది. కళ్ళల్లో నీళ్ళు ఉబికాయి.

కొంచెం దూరంగాఉన్నా ఇన్నాళ్ళూ ఓ మహావృక్షం నీడలో ఉన్నట్లుగా అన్పించింది.

ఇప్పుడు ఆ వటవృక్షం కూలిపోతూ వుంది. తనను ఎంతగానో ప్రేమించే అమ్మ కనుమరుగవబోతూ వుంది. ఆ తలంపుతో ఓ విధమైన భయం, ఆందోళన నన్నుఊపేసింది.

ప్రియతమ్ అమెరికా ప్రయాణం వాయిదా వేసుకున్నాడు. సుమలత వచ్చి అత్తగారిని చూసి హైదరాబాద్ తిరిగి వెళ్ళిపోయింది.

నేనూ, ప్రియతమ్ వంతులు వేసుకుని ఇంట్లో అమ్మ మంచం పక్కనే కూర్చున్నాం, ఆమెకు అవసరమైన మందులు, ఆహారం అందిస్తూ.

అమ్మ కూడా చివరిరోజుల్లో ఆస్పత్రిలో పడుండటం కన్నా తనకు అలవాటైన పరిసరాల్లో వుండటం సంతృప్తిని కల్గించింది.

నాన్న తాగొచ్చి తనను కొట్టబోతుంటే అడ్డుపడి ఆ దెబ్బలు కాచిన అమ్మ, చదువు ధ్యాసలో పడి పుస్తకాల్లో దూరిపోతే, పళ్ళెంతో తన దగ్గరికొచ్చి ముద్దలు తినిపించిన అమ్మ, తను డాక్టరు కావాలని పట్టుబట్టి చదివించిన అమ్మ" ఇప్పుడు తనకు దూరమైపోతూ వుంది.

కొన్ని రోజులు మంచంమీద ఉండి మాట్లాడగలిగిందిగాని క్రమంగా నోటమాట పడిపోయింది. మొహంలో ప్రశాంతత, ధైర్యం, ఓర్పు, వర్చస్సు మాత్రం అలాగే వుండిపోయాయి.

ఇంట్లో అటకమీద వున్న పాతపుస్తకాల పెట్టె తీశాడు ప్రియతమ్. అందులో డాక్టర్ బెతూన్ జీవితకథ వుంది. చదువుకునే రోజుల్లో ఎంతో ఇష్టంగా చదివేవాడు ఆ పుస్తకాన్ని.

స్పెయిన్, చైనా దేశాల్లో యుద్ధభూమిలో తిరుగుతూ గాయపడినవారికి రక్తం ఎక్కిస్తూ చికిత్సలు చేస్తూ విధి నిర్వహణలోనే ప్రాణాలు అర్పించిన అమరజీవి డాక్టర్ బెతూన్.

ఆ పుస్తకం చదివాక ప్రియతమ్ నావైపు తిరిగిన అడిగిన ప్రశ్న నన్ను ఇబ్బంది పెట్టింది.

"యుద్ధరంగానికి వెళ్ళి గాయపడినవారికి సేవలు చేయకపోయినా ప్రజల విమోచనా పోరాటాలలో పాల్గొనే సాహసం లేకపోయినా, కనీసం మారుమూల గ్రామాలకు వెళ్ళి వైద్యసేవలు ఎందుకు అందించలేకపోతున్నాం?"

కొడుక్కి ఏం సమాధానం చెప్పగలడు?

అమ్మ మాట ఎందుకు నిర్లక్ష్యం చేశాడు? స్వగ్రామం దగ్గర్లో ప్రాక్టీసు పెడదామని భార్యకు ఎందుకు గట్టిగా చెప్పలేకపోయాడు?

అమ్మ మంచం దగ్గరకెళ్లి కూర్చున్నాను.

తనవంక తదేకంగా చూసిందామె.

నా చూపులు ఆమె మొహంపై నిలిచాయి.

ఒక గంటసేపు దృష్టి మరల్చకుండా అలాగే కూర్చుండిపోయాను.

చివరిరోజుల్లో కూడా ఆమె కళ్ళల్లో నిర్మలత్వం.

నా చేతిని తన చేతిలోకి తీసుకుని ఆర్తితో నిమిరింది. ఆమె శరీరంలో తనూ ఓ భాగమేనని అప్పుడు అన్పించింది. అమ్మలాగే మరో రోజు కాలగర్భంలో కల్సిపోతాడు. అప్పుడు, ఈ ఆస్తులు అంతస్తులు వెంటరావు. చివరి క్షణాల్లో నన్ను మౌనంగా అమ్మ ఏదో అడుగుతోంది.

ఆమె మనస్సులోని మాట ఆమె చేతిస్పర్శ ద్వారా నా మెదడు పొరల్లోకి చేరింది.

"నీ మనవడు అమెరికా వెళ్ళడులే....ఇక్కడే ఉండి గ్రామస్థులకు వైద్యసదుపాయం అందిస్తాడు... సరేనా?" అన్నాను ఆమెకు వినిపించేలా, ఆమెను సంతృప్తిపర్చాలనే ఉద్దేశ్యంతో.

ఆమె ముఖంలో నవ్వు తొలగిచూసింది. అస్తమించే సూర్యుడి నుంచి వచ్చే అద్భుతమైన అరుణిమతో నిండిన కాంతికిరణంలా అమ్మ కళ్ళలో వెలుగు. ఎంతో ప్రశాంతత ఆమె ముఖంలో.

ఆమె ముఖాన్ని చేత్తో నిమిరాడు ప్రియతమ్. "నీకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం నాయనమ్మా" అన్నాడు రుద్ధమైన కంఠంతో.

మనవడి మాటలు మధురంగా అన్పించాయి ఆమెకు. వాడి మాటలకే ఎక్కువ సంతోషపడింది. వాడివైపే చూస్తూ ప్రాణాలు వదిలింది.

నా కళ్ళల్లో నీళ్ల నిలిచాయి. దుఃఖం నుంచి వచ్చిన కన్నీళ్ళు కావని. చివరి క్షణాల్లో అమ్మని సంతృప్తిపర్చాననే, సంతోషం నుంచి వచ్చిన ఆనంద బాష్పాలు, అమ్మ లోగిలిలోనే వుండిపోవాలని నిశ్చయించుకున్నాం. సొంత ఊరులో వుంటే అమ్మఒడిలో ఉన్నంత తృప్తి.

– 'స్వాతి' మాసపత్రిక, మార్చి **2008**